

ఎలక్ట్రిక్ బగ్గీని ప్రారంభిస్తున్న ఎంపీ రవిచంద్ర

నిమ్స్‌కు బగ్గీ అందజేసిన ఎంపీ రవిచంద్ర

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధులతో ఎలక్ట్రిక్ బగ్గీ అందజేశారు. దీనిని ఆస్పత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పచ్చజెండా ఊపి బగ్గీని నడిపారు. ఎంపీ వద్దిరాజు ఈ ఆస్పత్రికి గతంలోనూ రెండు బగ్గీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను డాక్టర్ లక్ష్మీభాస్కర్, పీఆర్వోలు సత్యాగౌడ్, వరలక్ష్మి, ఉష తదితరులు శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూర్య విష్ణు, బండి సంజీవ్, యాదా క్రాంతి, బండారి అనిల్, వెంకట్ గౌడ్, పి.శ్రీరామ్, జి.అరుణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి

ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్లకు భారీగా అర్జీలు

బేగంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 8,070 అర్జీలు అందాయి. వాటిలో 6,354 అర్జీలు కేవలం ఇందిరమ్మ ఇళ్ల కోసమే వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి 192, విద్యుత్ శాఖకు 135, రెవెన్యూకు 46, ఇతర శాఖలకు సంబంధించి 96 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు జలగం వెంగళరావు పార్క్, లక్ష్మి నగర్, యూసుఫ్‌గూడ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నందినగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏజీ కాలనీ, ఇంజనీర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు సీఓడీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంట వరకు పోలీస్ లైన్స్, మారుతీనగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్, ప్రగతి నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామరాజు

తెలంగాణ తొలిదశ ఉద్యమకారులకు అన్యాయం

- నాటి ఉద్యమకారులు 4వేల మంది ఇంకా బతికే ఉన్నారు
- ప్రత్యేక కమిటీ ద్వారా గుర్తింపు కార్డులు జారీచేయాలి
- 1969 రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు రామరాజు

మన్సూరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 1969 నాటి ఉద్యమ స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమం కొనసాగిందని, ఉద్యమ స్ఫూర్తితో వచ్చిన తెలంగాణలో ఉద్యమకారులకే తీవ్ర అన్యాయం జరగడం బాధాకరమని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన మలిదశ ఉద్యమకారులతో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో మంగళవారం సంఘం రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసి 1969 నాటి ఉద్యమకారుల సమస్యలను పలు రకాలుగా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నామని, కానీ ఏ ఒక్క ప్రభుత్వం మేనిఫెస్టోలో తప్ప తమ గోడును పట్టించుకోవడం లేదన్నారు. 1969 నాటి ఎంతో మంది ఉద్యమకారుల్లో ప్రస్తుతం సుమారు 4వేల మంది మాత్రమే సజీవంగా ఉన్నారన్నారు. ప్రత్యేక కమిటీ ద్వారా వారికి గుర్తింపు కార్డులు జారీచేయాలని కోరారు. అదేవిధంగా గౌరవప్రదమైన రూ.10వేల నుంచి రూ.15వేల పెన్షన్ , 250 చదరపు గజాల ఇంటి స్థలం, ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న తమకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం, ఉచిత రవాణా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల మలిదశ ఉద్యమకారులు వనం చంద్రమౌళి, యేళ్ల చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డి.సుదర్శన్ రావు, కె.సీతారాంరెడ్డి, కె.విశ్వేశ్వర్‌రావు, బొమ్మిడి లక్ష్మీనారాయణ, ఎన్.భాస్కర్‌శర్మ, కూతురు కృష్ణమూర్తి, ముత్తినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

- రూ.26.25 లక్షలు కొల్లగొట్టిన ముఠా
- నలుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసి రూ.26.25 లక్షలు కొల్లగొట్టిన ముఠా ఆట కట్టించారు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటకు చెందిన గడ్డపల్ల పవన్‌కుమార్, కింద్రాబాద్‌కు చెందిన బోగా రేవంత్, అంబర్‌పేటకు చెందిన సకినాల సుధీర్, ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన రాజీవ్‌రెడ్డి ఒకరి ద్వారా మరొకరికి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలని రేవంత్ పథకం వేశాడు. ఆ విషయాన్ని పవన్‌కు చెప్పాడు. సుధీర్‌కు గతంలో కన్సల్టెన్సీలో పనిచేసిన అనుభవం ఉండటంతో నిరుద్యోగులను ఉద్యోగాల పేరుతో బురిడీ కొట్టించి డబ్బు సంపాదించాలని నిర్ణయించారు. ఇలా సుధీర్ నిరుద్యోగుల డేటాను సేకరించి పవన్‌కు ఇచ్చేవాడు. పవన్ హెచ్‌ఆర్ మేనేజర్‌లా మాట్లాడుతూ ఐటీ కంపెనీల్లో బ్యాక్‌డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించేవాడు. ఆ తర్వాత వారికి ఫేక్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగానికి ఎంపికైనట్లు నమ్మించేవాడు. అలా ఒక్కో ఉద్యోగానికి రూ.2 లక్షల చొప్పున 13 మంది నుంచి రూ.26.25 లక్షలు వసూలు చేశారు. తర్వాత మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను సంప్రదించడంతో నార్త్‌జోన్ పోలీసులు రంగంలోకి దిగారు. మారేడుపల్లి పోలీసులతో కలిసి నిందితులను పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.67 లక్షల నగదు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మారేడుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ ప్రాంగణంలో విద్యార్థులకు పాఠాలు

- పాఠశాల భవనం నిర్మించని అధికారులు
- కమ్యూనిటీహాల్, ఆలయంలోనే తరగతులు
- ఏళ్లుగా ఇదే పరిస్థితి
- సింగాడికుంటలో విద్యార్థుల దుస్థితి ఇదీ

బంజారాహిల్స్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుకోవాలనే ఆరాటం ఉన్నప్పటికీ అందుకు అవసరమైన పాఠశాల భవనం లేదు. దీంతో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ కూర్చొని విద్యనభ్యసిస్తున్నారు. ఓ రోజు కమ్యూనిటీహాల్‌లో, మరో రోజు పక్కనే ఉన్న దేవాలయంలో వారు చదువుకుంటున్నారు. రెండు చోట్లా ఏదైనా వేడుక ఉంటే ఇంటికే పరిమితం కావాలి. విద్యార్థులు ఇన్ని అవస్థలు పడుతున్నా పాలకులు, విద్యాశాఖ అధికారులు మాత్రం పాఠశాల భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. గ్రామాల్లో సైతం ప్రభుత్వ పాఠశాలలు ఉన్న ఈ రోజుల్లో నగరం నడిబొడ్డున ఉన్న బంజారాహిల్స్‌కు సమీపంలో ఉన్న ఉదయ్‌నగర్‌లో ఇప్పటికీ పాఠశాల కోసం భవనం లేకపోవడం విద్యా శాఖ చిత్తశుద్ధి నిదర్శనం. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్ డివిజన్ రోడ్డు నంబర్ 11 సింగాడికుంటలో ప్రభుత్వ పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

అందరూ పేదల పిల్లలే

సింగాడికుంట బస్తీలో భవనాల కన్నా పెంకుటిళ్లే అధికంగా ఉంటాయి. బిహార్, ఒడిశాతో పాటు వివిధ జిల్లాల నుంచి వలస వచ్చిన కార్మికులు అధికంగా నివాసముంటున్నారు. ఇలాంటి వారి పిల్లలకు విద్యనేర్పేందుకు విద్యామంచ్ అనే స్వచ్ఛంద సంస్థ పదేళ్ల క్రితం వీధి పాఠశాలలు నిర్వహించడం ప్రారంభించింది. బీటెక్, ఎంటెక్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ సంస్థలో వాలంటీర్లుగా మారి పేద పిల్లలను చేరదీసి చదువు చెప్పేవారు. విద్యార్థుల సంఖ్య వంద దాటగానే విద్యాశాఖ ద్వారా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించేవారు. ఇలా ఉదయ్‌నగర్‌లో కనీసం 200 మంది విద్యార్థులు విద్యామంచ్‌లో చేరారు. ఈ విషయాన్ని విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లగా సమీపంలో పాఠశాల లేకపోవడంతో బస్తీలోనే ప్రభుత్వ పాఠశాల నిర్వహించాలని నిర్ణయించింది. తాత్కాలికంగా ప్రాథమిక పాఠశాలను కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసింది.



ఆలయ ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు

ఉదయ్‌నగర్‌లో దాదాపు 700 కుటుంబాలు ఉంటున్నాయి. వీరందరికీ ఒక్కటే కమ్యూనిటీహాల్ ఉంది. మరో ప్రభుత్వ భవనం అంటూ లేదు. దీంతో కమ్యూనిటీహాల్‌లో పాఠశాల ఏర్పాటు చేయడంపై బస్తీ వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బస్తీ సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు తమకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు పాలకులు, విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం కమ్యూనిటీహాల్‌లో ఏదైనా కార్యక్రమం జరిగితే విద్యార్థులు పక్కనే ఉన్న అమ్మవారి దేవాలయంలో చదువుకుంటున్నారు. రెండుచోట్లా కార్యక్రమాలు ఉంటే ఇంటికే పరిమితమవుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు ఉన్నా..

ఉదయ్‌నగర్‌లో అనేక చోట్ల ప్రభుత్వ మిగులు స్థలాలు ఉన్నాయి. వాటిలో అనువైన దానిని చూసి ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఓ దశలో ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర గద్వాల్ విజయలక్ష్మికి రెండు చోట్ల స్థలాలను చూపించారు. దీంతో వారు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ ఇంతవరకు పాఠశాల నిర్మాణానికి కనీసం ప్రతిపాదనలు సిద్ధం చేయలేదు. ప్రస్తుతం వీటిలో ఓ స్థలం వివాదంలో పడింది. ఇవే కాక మరో ఏడు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఇవి కూడా వివాదాల్లో పడకముందే పాఠశాల భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పాలకులు దృష్టి సారించాలి

పేరుకే బస్తీలో ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల ఉంది. కానీ ఇప్పటికీ తరగతి గదులు నిర్వహించేందుకు భవనం లేకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్య ధోరణికీ అద్దం పడుతోంది. ఇలాంటి ఇబ్బందులతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఎక్కడ కుదిరితే అక్కడ తరగతి గదులు నిర్వహించడం వల్ల వారికి విద్యపై మక్కువ తగ్గే అవకాశం ఉంది. దీనిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలి.

- రాములు, స్థానికుడు

కావాల్సినంత స్థలం ఉంది

మా బస్తీలో ఉన్నత పాఠశాల నిర్మించేందుకు సైతం కావాల్సినంత స్థలం ఉంది. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇలాగే వదిలేస్తే ఆ స్థలాలు కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎన్నికలు వచ్చినప్పుడల్లా అందరూ వాగ్దానాలు చేస్తున్నారు తప్ప పాఠశాల నిర్మించేందుకు ఎవరూ చొరవ తీసుకోడం లేదు.

- సంగీత, స్థానికురాలు

ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

- ఎంపీ ఈటల రాజేందర్



సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులతో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

ఖైరతాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం ఆయన ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ మజ్దూర్ సంఘ్ క్యాడర్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ అంతా కలియదిరిగి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం మూతపడే పరిస్థితితో ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి తలెత్తడంతో నిధులు మంజూరు చేసి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. పాతికేళ్ల క్రితం మూతపడ్డ రామగుండం ఎరువుల కంపనీని తెరిపించడం ఎవరితరం కాలేదని, అయితే ప్రధాని మోదీ దానికి 6,300 కోట్ల రూపాయలు కేటాయించి ప్రజలకు అంకితం చేశారన్నారు. దేశంలో చదువుకుంటున్న యవతరానికి ఉపాధి కల్పించే ఆలోచనతో బడ్జెట్‌లో రూ.4 లక్షల కోట్లను కేటాయించారని తెలిపారు. ఉద్యోగాల కోసం 6 నెలల పాటు నోటిఫికేషన్లు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్మిక సంఘాలలో పనిచేసే వారు కుటుంబాలతో పాటు కంపనీ ఎదుగుదలకు, కార్మికుల శ్రేయస్సు, హక్కుల కోసం పనిచేయాల్సి ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మజ్దూర్ సంఘ్‌ని గెలిపించాలని ఆయన ఉద్యోగులను కోరారు.

బీసీలు రాజ్యాధికారం చేజిక్కించుకోవాలి

- బీఎస్పీ ఏపీ సమన్వయకర్త పూర్ణచందర్‌రావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పూర్ణచందర్‌రావు తదితరులు

పంజాగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జన నాయక్, భారతరత్న కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో బీసీలు రాజ్యాధికారం చేజిక్కించుకోవాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఏపీ సమన్వయకర్త జె.పూర్ణచందర్‌రావు అన్నారు. బీసీ టైమ్స్, బీసీ సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ జయంతి, పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వతంత్ర భారత దేశ చరిత్రలో కర్పూరి ఠాకూర్ లాంటి మహోన్నత వ్యక్తులు చాలా అరుదని, అంతటి ఉన్నత భావాలు, పోరాట పటిమ ఉన్న వ్యక్తి కులాధిపత్య రాజకీయాల్లో పైకి రావడం ఆశ్చర్యకరమన్నారు. బీసీలకు రాజ్యాధికారం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలన్నారు. 50 శాతం పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే షరతులు పెట్టే నాయకులు అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో పది శాతం రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. ఈ పరిస్థితి మారాలంటే బీసీలు అధికారం చేజిక్కించుకోవాలన్నారు. కేంద్రంలో కులగణనపై మాట్లాడే కాంగ్రెస్ పార్టీ తెలుగు రాష్ట్రాలలో కులగణనపై నోరు మెదపదని విమర్శించారు. సమావేశంలో బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, మోడల శ్రీనివాస్ సాగర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, నరెడ్ల శ్రీనివాసులు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కర్పూరి ఠాకూర్ పుస్తక రచయితలు బ్రహ్మయ్య, సత్యనారాయణ, నరసయ్య, వి.సుబ్బయ్య పాల్గొన్నారు.

దేశ భద్రతపై 'ఎక్సర్‌సైజ్ టాసా శక్తి' సదస్సు

అల్వాల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తెలంగాణ, అంధ్రా సబ్‌ఏరియా ప్రధాన కార్యాలయంలో 'ఎక్సర్‌సైజ్ టాసా శక్తి' అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికపై బహుళ రక్షణ సంస్థలు పాల్గొని దేశ భద్రతపై చర్చించాయి. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ చర్చ కార్యక్రమంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ నేవీ, తెలంగాణ రాష్ట్ర పోలీస్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రీయల్ ఫోర్స్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్, ఇండియన్ రైల్వేస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీస్ ప్రతినిధులు పాల్గొన్నారు. భద్రతా సవాళ్లను పరిష్కరించడానికి వివిధ భద్రతా ఏజెన్సీల మధ్య మరింత సహకారం, సమన్వయాన్ని పెంపొందించడం లక్ష్యంగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రా సబ్‌ఏరియా కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా మాట్లాడుతూ.. ఈ వేదిక బాధ్యతాయుతమైన రంగాల భద్రతను నిర్ధారించడంలో వాటాదారులకు వారి నైపుణ్యం, అత్యుత్తమ అభ్యసన, అనుభవాలను పంచుకోవడానికి దోహదపడుతుందన్నారు. దేశ భద్రతా ఏజెన్సీల మధ్య సహకారానికి సంబంధించిన ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఆధునిక భద్రతా సవాళ్లను ఎదుర్కోవడం కోసం వివిధ భద్రతా సంస్థలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశం దేశరక్షణకు దోహదపడుతుందన్నారు. రెండు రోజుల చర్చా వేదిక 'ఎక్సర్‌సైజ్ టాసా శక్తి' విజయవంతగా ముగిసిందని తెలిపారు. జాతీయ భద్రత సాధనలో అంతర్-ఏజెన్సీ సహకారాన్ని ప్రోత్సహించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు.

డైరీ ఆవిష్కరణ



తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాల డైరీని ఎంపీ మల్లు రవి మంగళవారం మింట్ కాంపౌండ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మేడి, చంద్రయ్య పాల్గొన్నారు.

- (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ)

వినతిపత్రం అందజేత



నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ పేరుతో వీధి వ్యాపారులను రోడ్డుపాలు చేస్తున్న చర్యలను తక్షణమే నిలిపివేయాలంటూ డీజీపీ జితేందర్‌కు లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధుల బృందం మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, మిట్టపల్లి బాబూరావు, జగదీష్‌గౌడ్, కృష్ణ ముదిరాజ్, అశోక్‌చారి పాల్గొన్నారు.

- (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ)

సైబర్ నేరాల ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వేగంగా స్పందించడం అవసరమని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. డిజిటల్ మోసాలు అంశంపై ఆర్‌బీఐ అధికారులు, పోలీసుల మధ్య ఉన్నత స్థాయి సమావేశం మంగళవారం జరగ్గా.. సీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ప్రతి నెలలో బ్యాంకులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ (ఎల్‌ఈఏ) మధ్య సమన్వయ వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, వాటిలో ప్రాసెస్ ఇంప్రూవ్‌మెంట్ చర్యలు, మోసాల తీరుతెన్నులపై అవగాహన, సమర్థవంతమైన సమన్వయంపై చర్చించాలని నిర్ణయించారు. కోర్టు రిఫండ్ ఆర్డర్లు, ఖాతాపై మల్టీపుల్ హోల్డ్స్ వంటి సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్‌ఓపీ) రూపకల్పన కోసం కమిటీని ఏర్పాటు చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సైబర్ క్రైమ్స్) కవిత, భిక్షంరెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకుల లీగల్ అడ్వైజర్స్ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ కమల్ ప్రసాద్ పట్నాయక్, జనరల్ మేనేజర్ రుచి అస్థానా పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



జూబ్లీహిల్స్‌లోని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని వాటర్ ఫౌంటెయిన్ నిర్వహణ లోపంతో అధ్వానంగా మారింది. ఇలా పాచితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.

- జూబ్లీహిల్స్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి)

అధిక లాభాల పేరుతో భారీ మోసం

- వ్యాపారి నుంచి రూ.20 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్లో అధిక లాభాలంటూ బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్ నగరానికి చెందిన వ్యాపారి నుంచి రూ.20.28 లక్షలు కొల్లగొట్టారు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. రెండు వారాల క్రితం నగరానికి చెందిన వ్యాపారి ఫేస్‌బుక్‌లో ఒక ప్రకటన చూశాడు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు పొందవచ్చని ఉండటంతో అందులో ఉన్న వాట్సాప్ నంబర్‌కు కాల్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేసిన మహిళ స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వచ్చే విధానాల గురించి వివరించింది. ఆమె మాటలు నమ్మిన బాధితుడు ప్రారంభంలో చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టి మంచి లాభాలు అందుకున్నాడు. ఆ తర్వాత ఆ మహిళ అతనికి ఓ వాట్సాప్ లింకును పంపింది (ఎస్.అనజోమర్.కామ్). ఇది అంతర్జాతీయ స్టాక్ అండ్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ అని, ఇందులో వివరాలు నమోదు చేసి పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించింది. అందుకు అవసరమైన లాగిన్ ఖాతాను సృష్టించారు. ఇదంతా నిజమని నమ్మిన బాధితుడు విడతలవారీగా రూ.20.28 లక్షల పెట్టుబడులు పెట్టాడు. అందుకు లాభాలతో కలిపి 77,275 యూఎస్ డాలర్స్ వచ్చినట్లు వర్చువల్‌గా చూపించారు. అయితే వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు వారు అంగీకరించలేదు. ఇంకా ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని డిమాండ్ చేయడం, విత్‌డ్రాకు అనుమతి ఇవ్వకపోవడంతో వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ ధార కవిత తెలిపారు.

PUBLIC NOTICE

The general public are hereby notified that my Client Sri. M. Channa Reddy, S/o Narasimha Reddy, aged about 77 years, R/o flat no 505, Venkata Vihar Apartments, Street No. 18, himayat Nagar, Hyderabad, Being the sole and absoute owner of H.No. 8-2- 684/1/10 part, admeasuring 545 Sq yards and 240 Sq Yards out of 1000 Sq Yards, Situated at survey number 129/39, Road no. 12 Banjara hills, ward No. 10, Block-H-T-S. No. 13 of shaikpet village, Golconda Mandal, due to his ill health has appointed sri R. Padmabhanabha Reddy S/o R.K Rama Reddy aged about 60 years, R/o flat no 505, Venkata Vihar Apartments, Street No.18, himayat Nagar, Hyderabad, as his special power of Attorney Holder to Present the Sale Deed Executed by him.

Should any party have any objection, they should submit the same to the undersigned with supporting documents. Any unlawful or illegal attempt to create any third-party interest by anyone shall be dealt with by initiating appropriate civil or criminal proceedings.

D.R. VARMA
YERRA LATCHANNA
KANURI SREENIVASA RAJA
(Advocates
Address: 103,Nirvana Apartments, Khairatabad, Hyderabad-04
CelloNo: 9030716666

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



వరలక్ష్మికి నియామక పత్రాన్ని అందజేస్తున్న సంతోష్‌కుమార్

డివిజన్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

అడ్డగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని డివిజన్ సంయుక్త కార్యదర్శి మేకల వరలక్ష్మి తెలిపారు. కాంగ్రెస్ అడ్డగుట్ట డివిజన్ సంయుక్త కార్యదర్శిగా మేకల వరలక్ష్మి నియమితులైయ్యారు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ చేతుల మీదుగా నియమాకపత్రాన్ని మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో అడ్డగుట్ట డివిజన్ సమస్యల వలయంలో చిక్కుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు పథకాలు అర్హులందరికీ అందుతాయని అన్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక కాంగ్రెస్ పార్టీపై పొంతనలేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తనకు ఈ పదవి అప్పగించిన ఆదం సంతోష్‌కుమార్, ఆదం భరత్‌కుమార్, అధ్యక్షుడు గణేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్ ఆస్పత్రిపై దుష్ప్రచారం తగదు

ఆసుపత్రి ఎండీ నందకిషోర్

సికింద్రాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వీఆర్ ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, మంచి ఆరోగ్యం పొందేందుకు తమ సేవలను వినియోగించుకోవాలని వీఆర్ ఆస్పత్రి ఎండీ నందకిషోర్ తెలిపారు. ఆసుపత్రిపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, కొంతమంది పనిపెట్టుకుని తమ ఆస్పత్రిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో ఎండీ నందకిషోర్ మాట్లాడుతూ బోయినపల్లి పరిసర ప్రాంతాల్లో పేద ప్రజలున్నారని, వారికి వైద్యసౌకర్యం అందించాలనే మంచి ఆసుపత్రి ప్రారంభించామని అన్నారు. ఇటీవల తన ఆస్పత్రిలో మధుసూదన్‌గౌడ్ అనే వ్యక్తి వైద్యం వికటించి చనిపోయాడని డాక్టర్లపై, ఆసుపత్రిపై బురద చల్లడం సమంజసం కాదని ఆయన అన్నారు. ఆ వ్యక్తికి నిపుణులైన డాక్టర్లు వైద్యం చేశారన్నారు.



అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

అత్యున్నత ప్రమాణాలతో గ్రంథాలయాల నిర్మాణం

● ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బొల్లారం, తిరుమలగిరిలో నిర్మాణంలో ఉన్న గ్రంధాలయాలను ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నామని, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఐ ప్రసాద్, డీఈ బుగ్గయ్యగౌడ్ పాల్గొన్నారు.



ఆనంద్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ యార్డు వ్యాపారులు దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్, మిర్యాల శ్రీనివాస్

మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఆనంద్‌బాబు బాధ్యతల స్వీకరణ

బోయిన్‌పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్‌గ దేవేందర్‌లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు ఆనంద్‌బాబును సత్కరించారు. ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. తనకు పదవి వచ్చేలా సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే శ్రీగణేష్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగ విద్యార్థి యువగర్జన పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలగిరి జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర పదవులు తన కాలి గోటితో సమానమని చెప్పే మంద కృష్ణమాదిగ పద్మశ్రీ అవార్డును ఎందుకు తీసుకున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ప్రశ్నించారు. కంటోన్మెంట్‌లో మంగళవారం మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేణు ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థి యువగర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ.. మంద కృష్ణమాదిగకు ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఇచ్చిన పద్మశ్రీ అవార్డును తిరస్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం పంపిన జాబితాలో ఆయన పేరు లేదని, బీజేపీలో చేరిన తర్వాత అవార్డు తీసుకుంటే మంచిదని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ మల్లేశం, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, కాంగ్రెస్ నేత డాక్టర్ బొమ్మెర స్టాలిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు బగ్గీ అందజేసిన ఎంపీ రవిచంద్ర

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధులతో ఎలక్ట్రిక్ బగ్గీ అందజేశారు. దీనిని ఆస్పత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పచ్చజెండా ఊపి బగ్గీని నడిపారు. ఎంపీ వద్దిరాజు ఈ ఆస్పత్రికి గతంలోనూ రెండు బగ్గీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను డాక్టర్ లక్ష్మీభాస్కర్, పీఆర్వోలు సత్యాగౌడ్, వరలక్ష్మి, ఉష తదితరులు శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూర్య విష్ణు, బండి సంజీవ్, యాదా క్రాంతి, బండారి అనిల్, వెంకట్ గౌడ్, పి.శ్రీరామ్, జి.అరుణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాకు చిక్కుకున్న పక్షిని కాపాడిన అధికారులు



మాంజాలో చిక్కుకున్న గద్దతో అటవీ, అగ్ని మాపక శాఖ అధికారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కేంద్రీయ విద్యాలయం సమీపంలో 80 అడుగుల చెట్టుపై ఓ గద్ద చైనా మాంజాలో చిక్కుకుంది. గమనించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి సహకారంతో పలువురు అధికారులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి పక్షిని కాపాడారు. యానిమల్ వారియర్ అనే ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధుల బృందం ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

కనుమరుగు కానున్న ఫుట్‌బాల్ గ్రౌండ్

● ఎలివేటెడ్ కారిడార్‌లో కలిసిపోనున్న మైదానం
● ఆవేదన చెందుతున్న క్రీడాకారులు
● నూతన గ్రౌండ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

తిరుమలగిరిలోని ఫుట్‌బాల్ గ్రౌండ్



తిరుమలగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో ఎంతో చరిత్ర కలిగిన తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ కనుమరుగు కానుంది. దీంతో క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటి వరకు ఎందరో క్రీడాకారులు ఈ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. అమూల్‌రాజ్, టోనీ జత్రాజ్, ఎం.మోహన్, ఫ్రాంచైస్ జీవీఆర్, ఎన్.మచ్చేందర్ కుమార్, పీపీ రాజ్‌కుమార్ తదితరులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న ఫుట్‌బాల్ గ్రౌండ్ పూర్తిగా కనుమరుగు అవుతుండటంతో క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు.

కొత్త గ్రౌండ్ ఏర్పాటు చేస్తాం



ఎంతో ఘన చరిత్ర కలిగిన తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో పోతే సమీప ప్రాంతంలోనే గ్రౌండ్ అందుబాటులో తీసుకొస్తాం. క్రీడాకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నూతన గ్రౌండ్‌లో మెరుగైన వసతులు కల్పిస్తాం.

\- రామకృష్ణ, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు

బ్రిటీష్ కాలం నుంచే ఫుట్‌బాల్‌పై ఆసక్తి

తిరుమలగిరి, బొల్లారం ప్రాంతాల్లో బ్రిటీష్ మిలిటరీ అధికారులు అధికంగా ఉండేవారు. వారంతా సాయంత్రం పూట ఆటవిడుపులో భాగంగా ఈ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడేవారు. వారు ఆడే సమయంలో చూసే ఆ ప్రాంత పౌరులు ఫుట్‌బాల్‌పై మక్కువ పెంచుకున్నారు. దీంతో వారు కూడా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. ఇలా ఇక్కడ ప్రాక్టీస్ చేసిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. దీంతో పాటు స్పోర్ట్స్ కోటాలో పబ్లిక్ సెక్టార్లో ఉద్యోగాలు చేసుకుంటూ ఎందరో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఎలివేటెడ్ కారిడార్‌లో గ్రౌండ్ పూర్తిగా పోతున్నందున ఇదే ప్రాంతంలో రక్షణ శాఖకు సంబంధించిన స్థలాల్లో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పద్మారావునగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులతోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ మంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనావాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మేకల మండిలో రూ.19.25 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అనేక ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను అబివృద్ధి చేసి దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. తాను ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, జీహెచ్ఎంసీ డీఈ ఆంజనేయులు, జలమండలి డీజీఎం ఆశిష్, శానిటేశన్ డీఈ వెంకటేశ్, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, స్ట్రీట్‌లైట్స్ ఏఈ అనూష, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్ రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల నిరసన

అభివృద్ధి పనుల ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వ్యతిరేకంగా డివిజన్ కాంగ్రెస్ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రజలు నిత్యం డ్రైనేజీ సమస్యలతో సతమతమవుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం మండిపడ్డారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతా చిరంజీవి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమ చేపట్టారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, సనత్‌నగర్ ఇన్‌చార్జ్ కోట నీలిమ సహకారంతో అభివృద్ధి పనులు ముందుకుసాగుతున్నాయని వారు పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



సదస్సులో అభివాదం చేస్తున్న మహిళా ఉద్యమకారులు

తార్నాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు తార్నాకలో తెలంగాణ ఉద్యమకారుల మహిళా వేదిక సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా ఉద్యమకారుల వేదిక అధ్యక్షురాలు కె.మాదవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహిళా ఉద్యమకారులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వాపోయారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఉద్యమకారులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు, 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.30 వేల పింఛన్, రూ.20 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అమరవీరుల గౌరవార్థం హైద్రాబాద్‌లో స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు లావణ్య, అరుణ, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సహాయ కార్యదర్శి ఇందిర, సరిత, వెంకటలక్ష్మి, అంజలి, లక్ష్మీకాంతమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌పై పిల్లల్లో మేధాశక్తి అవసరం



అబాకస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అడ్డగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై అబాకస్‌పై అవగాహన ఎంతో అవసరమని నిర్వాహకులు అంబిక సూచించారు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఓ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన అబాకస్ పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల్లో మేధాశక్తి పెంచేందుకు ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు 20 రెట్లు మెరుగ్గా ఉన్నారని 39 పిల్లల్లో ఒకరు రన్నరప్‌గా గెలుచుకోగా 58 విద్యార్థుల్లో 2వ రన్నరప్ గెలుచుకున్నారన్నారు. ఇంటర్‌లో 90% మార్కులు సంపాదించిన విద్యార్థులకు అబాకస్ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో టీచర్లు కిరణ్, ప్రవళిక, శ్రీలేఖ, అర్చనలు పాల్గొన్నారు.

1న 'వేలగొంతులు-లక్ష డప్పులు' జిల్లా సన్నాహక సదస్సు



సీతాఫల్‌మండిలో డప్పుల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బౌద్ధనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 1న తలపెట్టిన వేలగొంతులు, లక్ష డప్పుల హైదరాబాద్ జిల్లా సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్పీ) హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో మంగళవారం సీతాఫల్‌మండి చౌరస్తాలో నిర్వహించిన డప్పుల ప్రదర్శన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధులు బొర్ర భిక్షపతిమాదిగ, మల్లెపాక అనిల్‌మాదిగ, మహంకాళి శ్రీనివాస్‌మాదిగ, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మొదటగా తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. లేదంటే మాదిగల నిరసనను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. హైదరాబాద్ జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి డప్పులు పట్టుకుని పెద్దఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుంజూరి విజయ్‌మాదిగ, పల్లెర్ల సుధాకర్‌మాదిగ, కొమురెల్లిబాబు, గౌరీశంకర్, తుమ్మల ప్రసాద్, చాగంటి యాదగిరి, డి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డాక్టర్ విశాల్‌రాజ్

మారేడుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యపై మంగళవారం ఈస్ట్ మారేడుపల్లి సెయింట్ మార్క్స్ కళాశాలలో డీఎంఓ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పికెట్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.విశాల్ రాజ్ పాల్గొని మాట్లాడారు. పరీక్షలకు హాజరయ్యే వారు ఒత్తిడిని అధిగమించడానికి అవసరమైన మెలకువలను వివరించారు. ముఖ్యంగా పొగాకు, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిళ్లకు గురయ్యే వారు 14416 (టెలీ మానస్) టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వారి ఇబ్బందులు చెప్పాలని సూచించారు.



విద్యుత్ సిబ్బందితో బీఆర్ఎస్ నాయకులు

నందనార్‌నగర్‌లో వీధి దీపాల ఏర్పాటు

అడ్డగుట్ట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ నందనార్‌నగర్‌లో హైమాస్ట్ లైట్లు పని చేయడంలేదని విద్యుత్ అధికారులు, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే కొత్త లైట్లను ఏర్పాటు చేశారని బస్తీ నాయకుడు శివకుమార్ మంగళవారం తెలిపారు. ఫిర్యాదు చేసిన వెంటనే కొత్త నట్లు ఏర్పాట్లు చేసిన అధికారులు, సిబ్బందికి, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడిగా కన్నాభిరాం



సిహెచ్ కన్నాభిరాం

అడ్డగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా తుకారాంగేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సీహెచ్ కన్నాభిరాం నియమితులయ్యారు. తనకు ఈ పదవి అప్పగించినందుకు సంస్థకు అంకిభావంతో పని చేస్తానన్నారు. తనకు ఈ అవకావం కల్పించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిలకు ధన్యవాదాలు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

● రూ.26.25 లక్షలు కొల్లగొట్టిన ముఠా ● నలుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసి రూ.26.25 లక్షలు కొల్లగొట్టిన ముఠా ఆటకట్టించారు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటకు చెందిన గడ్డపల్ల పవన్‌కుమార్, కింద్రాబాద్‌కు చెందిన బోగా రేవంత్, అంబర్‌పేటకు చెందిన సకినాల సుధీర్, ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన రాజీవ్‌రెడ్డి ఒకరి ద్వారా మరొకరికి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలని రేవంత్ పథకం వేశాడు. ఆ విషయాన్ని పవన్‌కు చెప్పాడు. సుధీర్‌కు గతంలో కన్సల్టెన్సీలో పనిచేసిన అనుభవం ఉండటంతో నిరుద్యోగులను ఉద్యోగాల పేరుతో బురిడీ కొట్టించి డబ్బు సంపాదించాలని నిర్ణయించారు. ఇలా సుధీర్ నిరుద్యోగుల డేటాను సేకరించి పవన్‌కు ఇచ్చేవాడు. పవన్ హెచ్‌ఆర్ మేనేజర్‌లా మాట్లాడుతూ ఐటీ కంపెనీల్లో బ్యాక్‌డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించేవాడు. ఆ తర్వాత వారికి ఫేక్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగానికి ఎంపికైనట్లు నమ్మించేవాడు. అలా ఒక్కో ఉద్యోగానికి రూ.2 లక్షల చొప్పున 13 మంది నుంచి రూ.26.25 లక్షలు వసూలు చేశారు. తర్వాత మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను సంప్రదించడంతో నార్త్‌జోన్ పోలీసులు రంగంలోకి దిగారు. మారేడుపల్లి పోలీసులతో కలిసి నిందితులను పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.67 లక్షల నగదు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మారేడుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా బాలిక.. చైల్డ్‌లైన్‌కు అప్పగింత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్నేహితులను కలిసేందుకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న బాలికను నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి రైల్వే స్టేషన్‌లో మంగళవారం నగరానికి చెందిన బాలిక ప్లాట్‌ఫాం నంబర్ 4లో ఒంటరిగా కూర్చొంది. ఆ సమయంలో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సుజాత బాలిక వద్దకు చేరుకుని ఆమె వివరాలు అడిగి తెలుసుకుంది. తల్లిదండ్రులకు తెలియకుండా స్నేహితులను కలిసేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చానని, ఇంటికి వెళ్లేందుకు తనకు ఇష్టం లేదని చెప్పింది. దీంతో బాలికను ప్రభుత్వ చైల్డ్ లైన్ సంస్థకు అప్పగించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల శిక్ష



లింగాల దీపక్ (ఫైల్)

రాంగోపాల్‌పేట్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహాకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని విక్టోరియా గంజ్‌లో నివాసముండే లింగాల దీపక్(32) ఐదేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. 2013 నవంబర్‌లో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు సెక్షన్ 376 కింద పోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారణ జరిపిన పోక్సో కేసుల ప్రత్యేక సెషన్స్ జడ్జి బి.పుష్పలత నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అంతేకాకుండా ప్రభుత్వం తరఫున బాధితురాలికి రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. కాగా లీగల్ సపోర్ట్ ఆఫీసర్ టి.కల్పన, ఐఓ ఎస్సై పరదేశీ జాన్, ఏఎస్సై ఉమ, భరోసా యూనిట్ సభ్యులను, పీసీలు సాయికుమార్, వంశీకృష్ణలను ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అభినందించారు.

దారిదోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

అడ్డగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి డబ్బులు కాజేసిన ఇద్దరు నిందితులను లాలాగూడ పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలుకు చెందిన కనకరాజు (25) ఈ నెల 27న కోర్టులో కేసు వాయిదా కోసం నగరానికి వచ్చాడు. కోర్టు పనులు పూర్తి చేసుకుని మంగళవారం ఉదయం మల్కాజిగిరి నుంచి ఎల్బీనగర్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. ఆ సమయంలో ఆటో డ్రైవర్ చంద్రకిరణ్ తన స్నేహితుడు మణికర కలిసి కనకరాజును మల్కాజిగిరి రాఘవేంద్ర టాకీస్ వైపు తీసుకెళ్లి రూ.8,500 నగదుతో పాటు సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఆటో తార్నాక వైపు వెళ్తుండగా లాలాగూడ క్రైమ్ కానిస్టేబుళ్లు మహేష్, రాజశేఖర్ బైకుపై వెంబడించి అడ్డుకున్నారు. డ్రైవర్ చంద్రకిరణ్‌ను విషయం అడగ్గా నిజం ఒప్పుకున్నాడు. వారిని రిమాండ్‌కు తరలించారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364